
## కేటీఆర్‌పై కేసు ఎత్తేసేదాకా పోరు: సిరికొండ



కేటీఆర్‌పై అక్రమ కేసును ఎత్తేసేదాకా పోరాటం ఆపబోమని మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి స్పష్టంచేశారు. కేసీఆర్ మంత్రిగా ఎన్నో పరిశ్రమలు తెచ్చి తెలంగాణ ప్రతిష్ఠను పెంచితే.. రేవంత్‌రెడ్డి సర్వనాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హామీలను అమలు చేయలేకే కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు.

### రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ: మహమూద్‌అలీ



కాంగ్రెస్ ఏడాది పాలన అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నదని ఎమ్మెల్సీ మహమూద్ అలీ విమర్శించారు. తెలంగాణను విశ్వవ్యాప్తం చేసేందుకు కృషి చేసిన కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు పోరాటలు కొత్తకాదని స్పష్టంచేశారు.

### రాజకీయ కక్ష సాధింపు: సబితాఇంద్రారెడ్డి



రాజకీయ కక్ష సాధింపుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై కేసు పెట్టిందని మాజీ మంత్రి పీ సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నదని తెలిపారు.

### రేవంత్‌రెడ్డికి బుద్ధిచెప్తాం: సత్యవతి రాథోడ్




ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్తామని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. అసెంబ్లీలో సమస్యలపై చర్చించకుండా ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు.

### కేటీఆర్‌పై కేసు నమోదు అక్రమం: కృష్ణారావు



కేటీఆర్‌పై కేసు నమోదు అక్రమమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు విమర్శించారు. రాజకీయ కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

### అప్రజాస్వామికం: జోగు రామన్న



రాష్ట్ర శ్రేయస్సుకు పాటుపడిన కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### అసెంబ్లీలో చర్చ పెట్టాలి: పద్మా దేవేందర్‌రెడ్డి



ఫార్ములా ఈ రేస్ నిర్వహణపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రేస్ పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించి, నగరం ఇమేజీని కేటీఆర్ పెంచారని కొనియాడారు.

### రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్: విద్యాసాగర్‌రావు



రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌తో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు విమర్శించారు. ఫార్ములా-ఈ రేస్ పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించి రాష్ట్ర ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై కేసులను ఖండిస్తున్నామని తెలిపారు.

### కక్షపూరితంగానే కేటీఆర్‌పై కేసు: కంచర్ల, రావుల



ప్రశ్నించడాన్ని సహించలేక కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేటీఆర్ కేసు నమోదు చేసిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. గ్యారెంటీలపై పెరుగుతున్న అసంతృప్తి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు.

### రాజకీయంగా ఎదుర్కోలేకే కేసు: రవీంద్రకుమార్



కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే అక్రమ కేసు బనాయించి కాంగ్రెస్ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై కేసు నమోదు చేసి రాష్ట్ర పరువు తీస్తున్నదని దుయ్యబట్టారు.

### తెలంగాణ చూస్తూ ఊరుకోదు: బడుగుల



తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన దిగ్గజనేత కేటీఆర్ జోలికొస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని మాజీ ఎంపీ లింగయ్యయాదవ్ రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. కేటీఆర్‌ను తప్పుడు కేసులతో అరెస్టు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తెలిపారు.

### రేవంత్‌ను ఏ1గా చేర్చాలి: గొంగిడి



కేటీఆర్‌ను అక్రమంగా టచ్ చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు సహించబోవని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ రేస్‌తో ఏటా రూ.700 కోట్లు సమకూర్చే ఆదాయానికి గండికొట్టిన కేసులో రేవంత్‌రెడ్డినే ఏ1గా చేర్చాలని డిమాండ్ చేశారు.

### ఫార్ములా రేస్‌లో అవినీతే జరగలేదు: బాజిరెడ్డి



ఈ రేసింగ్ పోటీల్లో అవినీతి జరగనేలేదని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తేల్చిచెప్పారు. ఒప్పందం ప్రకారమే పోటీలు జరిగాయని స్పష్టం చేశారు. హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన సీఎం నాటకాలాడుతున్నారని విమర్శించారు.

### కేటీఆర్ అంటే రేవంత్‌కు వణుకు: మాలోత్ కవిత




ఫార్ములా -ఈ కార్ రేస్‌పై కేటీఆర్‌పై ప్రభుత్వం పెట్టిన కేసు అక్రమమని మాజీ ఎంపీ మాలోత్ కవిత పేర్కొన్నారు. కేటీఆర్‌పై కేసు రాజకీయ కక్షలో భాగమేనని స్పష్టం చేశారు.

### ప్రజాపాలన పేరిట దుర్మార్గాలు: క్రాంతి కిరణ్




నిత్యం ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌పై రాజకీయ కక్షతోనే అక్రమ కేసు పెట్టారని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ విమర్శించారు. తెలంగాణను సీఎం రేవంత్‌రెడ్డి అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు.

### కాంగ్రెస్‌వి నీచ రాజకీయాలు : గండ్ర



కాంగ్రెస్ సర్కార్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాల జాబితాలో చేర్చిన గొప్ప నేత కేటీఆర్ అని కొనియాడారు.



### కేసులే రేవంత్ టార్గెట్: సండ్ర, చంద్రవతి, కొండబాల

బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని తమ పార్టీ నాయకులపై కేసులే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బానోతు చంద్రవతి విమర్శించారు. హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు తేవడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ-రేస్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు.



### రేవంత్‌రెడ్డిపైనే కేసు పెట్టాలి: దాస్యం, పెద్ది, చల్లా, నన్నపునేని

ప్రపంచపటంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన కేటీఆర్‌పై కాకుండా రాష్ట్ర పరువు తీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపైనే కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోమని, మరో ఉద్యమం ఎగిసిపడుతుందని స్పష్టం చేశారు.

# రాష్ట్ర ఇమేజ్.. రేవంత్‌తో డ్యామేజ్

**రేవంత్ తుగ్లక్ చర్యలతో తెలంగాణకు 600 కోట్ల నష్టం • అసెంబ్లీలో సీఎం చెప్పినవన్నీ అబద్ధాలే!**

- పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన
- బుకాయింపులు, దబాయింపులు తప్ప ఆయనకు విజన్ లేదు..విజ్‌డమ్ లేదు
- తప్పులు ఎత్తిచూపినందుకే అక్రమ కేసు
- అవినీతే లేని కేసులో ఏసీబీ విచారణా?
- 24 గంటల్లోనే ఈడీ ఎలా ఎంటరైంది?
- కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు
- ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీ నాటకాలు
- విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు ఫైర్



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తేతెలంగాణ): ఫోర్త్ సిటీ పేరిట రేవంత్ బ్రదర్స్ సాగిస్తున్న అరాచకాలు, అమృత్ స్కీంలో బావమరిది బాగోతాలు, ఫార్మాసిటీ ముసుగులో బంధువుల అక్రమాలు, మూసీ బ్యూటిఫికేషన్ పేరిట సాగించిన లూటిఫికేషన్‌ను ఆధారాలతో ఎత్తిచూపినందుకే కేటీఆర్‌పై ఈ కార్ రేస్ పేరిట సీఎం అక్రమ కేసు బనాయించారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇదీ ముమ్మాటికీ డొల్ల కేసు అని స్పష్టంచేశారు. కేసులో అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులివ్వడంతోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారని అభిప్రాయపడ్డారు. అవినీతికి అవకాశమే లేని ఒప్పందంలో ఏసీబీతో విచారణ చేయించడమేమిటని నిలదీశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, చింత ప్రభాకర్, వివేకానంద, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ఫార్ములా-ఈపై వాస్తవాలు చెప్పేందుకు చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ సభ్యులను బయటకు పంపించి సీఎం పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు.

### ఇతర రాష్ట్రాల్లోనూ రేస్‌లు

తెలంగాణ తర్వాత మహారాష్ట్ర సైతం ఫార్ములా ఈ-రేస్ నిర్వహణకు ముందుకొచ్చిందని హరీశ్ గుర్తుచేశారు. అప్పటి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కేటీఆర్‌ను అభినందించారని గుర్తుచేశారు. రూ.42 కోట్లతో తమిళనాడు ఫార్ములా-4, రూ. 1700 కోట్లతో ఉత్తరప్రదేశ్ ఫార్ములా-వన్ నిర్వహించాయని, చంద్రబాబు సైతం అమరావతికి తీసుకెళ్లేందుకు యత్నించారని చెప్పారు. 'ఇందులో అక్రమాలకు అవకాశముంటే ఆ రాష్ట్రాలు ఎందుకు నిర్వహిస్తాయి? అంటే ఆయా రాష్ట్రాలు కూడా అవినీతికి పాల్పడ్డట్టేనా?' అంటూ ప్రశ్నలు సంధించారు.

> **ఈ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కేటీఆర్ పెంచితే, తుగ్లక్ చర్యలతో రేవంత్‌రెడ్డి డ్యామేజ్ చేశాడు. రేస్‌తో రాష్ట్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. 600 కోట్ల ఆదాయం వచ్చింది. కానీ ఒప్పందాన్ని రద్దుచేసి రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి రూ. 600 కోట్ల నష్టాన్ని మిగిల్చారు.**
> **-హరీశ్‌రావు**

> **ఫార్ములా ఈ-కేసులో అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులివ్వడంతోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారు. ఇది ముమ్మాటికీ డొల్ల కేసు. ఈ వ్యవహారంలో నిజంగా అక్రమాలే జరిగితే కేటీఆర్‌ను ఏ1గా చేర్చి, ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీపై కేసెందుకు పెట్టలేదు?**
> **-హరీశ్‌రావు**

### అవినీతి లేదని మంత్రి పొన్నమే చెప్పారు

ఫార్ములా ఈ-రేస్ అగ్రిమెంట్ కింద ఎన్నికల కోడ్ ఉల్లంఘించి నగదు ట్రాన్స్‌ఫార్మర్ చేశారని ఆరోపించిన మంత్రి పొన్నం ప్రభాకరే ఇందులో అవినీతి జరగలేదని చెప్పారని హరీశ్ గుర్తుచేశారు. 'రాష్ట్ర ఖజానా, నేషనల్ బ్యాంకు నుంచి నగదు పంపించారు.. ఇర్రెగ్యులారిటీ తప్ప ఇల్లీగల్ ఏమీలేదు' అని స్పష్టం చేశారు. పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి అక్రమ కేసుల పేరిట నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు.

### దుష్ప్రచారంతో రాష్ట్ర ప్రతిష్ఠ దిగజార్చారు

రేవంత్ సర్కార్ ఆరు గ్యారెంటీలను పక్కనబెట్టి రాష్ట్రం దివాలా తీసిందని గోబెల్స్ ప్రచారం చేసిందని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కారు అనుసరించిన దగాకోరు విధానాలతో ఏడాదిలోనే తెలంగాణను దివాలా తీయించారని దునుమాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని అబద్ధాలు చెప్పిన రేవంత్‌రెడ్డికి అసెంబ్లీ సాక్షిగా దిమ్మతిరిగే సమాధానమిచ్చామని చెప్పారు. రేవంత్‌రెడ్డికి విజన్ లేదు..విస్‌డమ్ లేదు..పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన తయారైంది' అంటూ ఎద్దేవా చేశారు.

### రైతుల నుంచి పోలీసులదాకా కేసులే

కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనలో నిరసన తెలిపిన వారిపై నిర్బంధాలు అమలు చేసి అణచివేతకు పాల్పడిందని హరీశ్ ధ్వజమెత్తారు. లగచర్ల రైతులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పోలీసు కుటుంబాలు, ప్రతిపక్షాలపై కేసులు బనాయించి దుర్మార్గాలకు ఒడిగట్టిందని దుయ్యబట్టారు.

### ప్రతిష్ఠ పెంచడమే కేటీఆర్ తప్పా?

గతంలో ఐటీ, ఇండస్ట్రియల్ మంత్రిగా కేటీఆర్ అనేక ఐటీ కంపెనీలు, ఇండస్ట్రీలను తెచ్చి హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచారని హరీశ్ గుర్తుచేశారు. అందుకే హైదరాబాద్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సీట్లను బీఆర్ఎస్ గెలుచుకున్నదని స్పష్టంచేశారు. 'గ్లోబల్ సిటీగా ఉన్న హైదరాబాద్‌ను ఈవీ రంగంలో పెట్టుబడులకు డెస్టినేషన్‌గా మార్చడం..తెలంగాణ సంపద పెంచేందుకు ప్రయత్నించడమే కేటీఆర్ చేసిన తప్పా? అందుకే ఆయనపై కేసు పెట్టారా?' అని నిలదీశారు.

> **పొంగులేటి ఇంటిపై దాడులు చేసి 80 రోజులు దాటినా కనీసం స్టేట్‌మెంట్ ఇవ్వని ఈడీ అధికారులు, ఇప్పుడు ఆగమేఘాలమీద స్పందించడంలో ఆంతర్యమేమిటి? ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన 24 గంటల్లోపే ఈడీ కేసు ఎలా నమోదైంది? ఇది బడేభాయ్..చోటే భాయ్ ఫెవీకాల్ బంధానికి నిదర్శనంకాదా?**
> **-హరీశ్‌రావు**

> **రేవంత్‌రెడ్డి పాలన పిచ్చిడి చేతిలో రాయిలా మారింది. రైతుల నుంచి సినిమా యాక్టర్ల దాకా అందరిపై కేసులు పెట్టడం, బుకాయింపులు, బనాయింపులు, దబాయింపులు తప్ప ఈ సర్కార్ ఒరగబెట్టిందేమిటి? దగాకోరు విధానాలతో ఏడాదిలోనే రాష్ట్రాన్ని దివాలా తీయించారు.**
> **-హరీశ్‌రావు**

### 24 గంటల్లోనే ఈడీ ఎందుకొచ్చింది?

ఈ-రేస్ వ్యవహారంలో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన 24 గంటల్లోపే ఈడీ కేసు నమోదు చేయడం బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనమని హరీశ్ విమర్శించారు. పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు జరిగి 80 రోజులు దాటినా కనీసం స్టేట్‌మెంట్ ఇవ్వని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఇప్పుడు ఆగమేఘాలమీద స్పందించడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. 'ఇది బడే భాయ్..చోటే భాయ్ ఫెవీకాల్ బంధానికి నిదర్శనం' అని ఎద్దేవాచేశారు. ఏదేమైనా రేవంత్ సర్కారు కుట్రలు, కుతంత్రాలకు దిగినా పోరాట నేపథ్యమున్న బీఆర్ఎస్ భయపడబోదని తేల్చిచెప్పారు. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.



## సీఎం ఆదేశాలతోనే దాడులు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలం, ఆదేశాలతోనే బీఆర్ఎస్ సభ్యులపై కాంగ్రెస్ సభ్యులు బాటిళ్లతో దాడి చేసేందుకు యత్నించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు ఓ పద్ధతి లేకుండా నడుస్తున్నాయని వివేకానంద ధ్వజమెత్తారు. శాసనసభ చరిత్రలోనే కొత్త సంప్రదాయాలకు రేవంత్ తెరలేపారని, రూల్స్‌కు వ్యతిరేకంగా, నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా సభను నడుపుతున్నారని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలే నడపలేని వాళ్లు.. ఇక ప్రభుత్వాన్ని ఏం నడుపుతారని ప్రశ్నించారు. సీఎం అనుభవరాహిత్యంతో సమస్యలు వస్తున్నాయని, ఆయన తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. సభలో కుట్ర పూరితంగా తమ గొంతు నొక్కుతున్నారని, ప్రజాకోర్టులో రేవంత్‌ను దోషిగా నిలబెడతామని స్పష్టం చేశారు.

### అన్ని వీడియోలు బయటపెట్టాలి: కౌశిక్‌రెడ్డి

అసెంబ్లీలో జరిగిన రాద్ధాంతంపై కావాలనే కొన్ని వీడియోలు మాత్రమే బయటపెట్టారని, తమ సభ్యులపై పేపర్లు విసిరి, అసభ్యంగా ప్రవర్తించి, చెప్పులు విసిరేందుకు కాంగ్రెస్ సభ్యులు యత్నించిన వీడియోలను సైతం బయటపెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### నేడు అసెంబ్లీలో రైతుభరోసాపై చర్చ

హైదరాబాద్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): రైతులు ఆశగా ఎదురుచూస్తున్న రైతుభరోసాపై అసెంబ్లీలో శనివారం చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సంక్రాంతి తర్వాత రైతుభరోసా ఇస్తామని, అసెంబ్లీలో చర్చ తర్వాతే విధి విధానాలు రూపొందిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

### భూ భారతి బిల్లుకు ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన భూభారతి బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు బిల్లును ఆమోదించినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శాసనసభలో వెల్లడించారు. భూభారతి బిల్లుపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చర్చను ప్రారంభించారు. చర్చ ముగిసిన అనంతరం బిల్లును ఆమోదించాల్సిందిగా సభను కోరారు. అనంతరం ఓటింగ్ నిర్వహించిన స్పీకర్.. బిల్లు ఆమోదం పొందినట్టు ప్రకటించారు. భూముల వివరాలను సురక్షితంగా ఉంచడంతోపాటు పారదర్శకతను తెచ్చేందుకే భూభారతి బిల్లును ప్రవేశపెట్టినట్టు సభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని 1.52 కోట్ల ఎకరాల భూముల వివరాలను భద్రపరిచేందుకు, యజమానుల హక్కులను కాపాడేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. ధరణిలో అనేక లోపాలున్నట్టు గుర్తించినందునే కొత్త విధానాన్ని తెచ్చామని తెలిపారు. తాజాగా భూముల నిర్వహణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్ఐసీకి అప్పగించామన్నారు. మరోవైపు ధరణి పోర్టల్ అంశాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

## భూ భారతి ప్రకటనలపై సభాహక్కుల నోటీస్

- ముందస్తు ప్రకటనలపై చర్యలకు బీఆర్ఎస్ఎల్పీ డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): భూ భారతి పథకంపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా శాసనసభా గౌరవాన్ని కించపరచిందని బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలపకుండానే చట్టంగా ఆమోదం పొందినట్టు డిసెంబర్ 19 (గురువారం)న అన్ని పత్రికల్లో ప్రభుత్వం ప్రకటనలు జారీ చేసిందని పేర్కొన్నది. సభా సంప్రదాయాలనే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రభుత్వం అవమానించిందని శుక్రవారం స్పీకర్‌కు ఇచ్చిన సభాహక్కుల నోటీస్‌లో స్పష్టంచేసింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాణిక్‌రావు, సుధీర్‌రెడ్డి, ముఠా గోపాల్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాగంటి గోపీనాథ్, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఫార్ములా ఈ-రేస్‌లో అవినీతిలేదు

- మంత్రి పొన్నం వ్యాఖ్యలే నిదర్శనం
- టీవోటీ మార్గదర్శకాల మేరకే ఓఆర్ఆర్ ఒప్పందం
- రద్దు చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఈ-రేస్‌లో అవినీతి జరగలేదని, మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ చేసే ప్రతీపనికి ప్రభుత్వ అనుమతులు అవసరం లేదని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంవత్సరకాలంగా ప్రభుత్వాన్ని అన్ని అంశాల్లో ఎండగడుతున్న క్రమంలో రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేసు పెట్టారన్న సంగతి ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. కేసుకు భయపడబోమని పునరుద్ఘాటించారు. రాజకీయంగా ఎదుర్కొంటూనే న్యాయస్థానంలో తమ వాదన వినిపిస్తామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. బ్యాంకు నుంచి బ్యాంకు లావాదేవీలు జరగడం వాస్తవమని, ఆ పంపిణీ విధానమే తప్పు అని పేర్కొన్నారు. అవినీతి జరగలేదని తెలిసినా ముఖ్యమంత్రి, మంత్రులు ఈ వ్యవహారాన్ని అంతా సైకోల మాదిరి తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

### తప్పులను కప్పిపుచ్చేందుకే డైవర్షన్ డ్రామా

అప్పుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం శాసనసభను, ప్రజలను తప్పుదారి పట్టించినట్టు ఆధారాలతో సహా మాజీ మంత్రి హరీశ్‌రావు సభలో తూర్పారబట్టారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం చెప్తున్న లెక్కలు తప్పని హరీశ్‌రావు ఎండగట్టడంతో ఏం చేయాలో పాలుపోక తనపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ ఏడాది కాలంగా చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌నే ప్రయోగించిందని తెలిపారు.

### ఓఆర్ఆర్ లీజుపై విచారణ చేయండి

ఓఆర్ఆర్ లీజుపై సిట్టింగ్ జడ్జితో గానీ, రిటైర్డ్ న్యాయమూర్తితో గానీ విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. టోల్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ మార్గదర్శకాలకు లోబడే లీజు ఒప్పందాలు జరిగాయని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాన్ని అనుసరించి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిబంధనలకు అనుగుణంగానే ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. ఒప్పందం ద్వారా వచ్చిన రూ. 7340 కోట్లను రైతుబంధుకు వినియోగించామని వివరించారు. అప్పటి క్యాబినెట్ సబ్‌కమిటీ సూచనలు చేసిందని, ఓఆర్ఆర్‌ను లీజుకిచ్చి తద్వారా వచ్చిన మొత్తాన్ని రైతు క్షేమం కోసం వినియోగించామే తప్ప అది దుర్వినియోగం కాలేదని తెలిపారు. ఓఆర్ఆర్ లీజు ద్వారా ప్రైవేట్ కంపెనీకి లబ్ధి చేకూరిందని రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణ పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నట్టు ప్రైవేట్ కంపెనీకి లేదా వ్యక్తులకు లబ్ధిచేకూర్చేలా ఒప్పందం జరిగిందని భావిస్తే దానిని రద్దు చేయాలని సవాల్ చేశారు. గతంలో ఔటర్ రింగ్‌రోడ్డు లీజుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని రేవంత్‌రెడ్డి అడ్డగోలు ఆరోపణలు చేసినందుకు హెచ్ఎండీఏ ఆయనపై పరువు నష్టం దావా వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికీ ఆ కేసు కొనసాగుతున్నదని చెప్పారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్‌శాఖ మంత్రిగా, హోంశాఖ మంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డికి బెదిరి అధికారులు వాస్తవాలు చెప్పరని, ఈ క్రమంలో వేయబోతున్న సిట్.. సిట్టంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్‌గానే మారుతుందని ఎద్దేవా చేశారు. అందుకే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని అన్నారు.

## భూ భారతి కాదు.. భూ హారతి!

- జమాబందీతో అక్రమార్కులకు పండుగ
- లోపాలు సవరించకుండా కొత్తచట్టం చేస్తరా?
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీలో శుక్రవారం ఆమోదించిన చట్టం భూ భారతి కాదని, అది భూ హారతని, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవాచేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడుతూ ధరణిలో ఉన్న లోపాలను సవరించకుండా తీసుకొచ్చిన కొత్త చట్టంతో రాష్ట్రంలోని 75 లక్షల మంది రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు. ధరణి వల్ల కోటీ 50 లక్షల ఎకరాలకు హక్కులు దక్కాయని తెలిపారు. అలాంటి రైతుల పాలిట భూ భారతి చట్టం పిడుగులాంటిదన్నారు. కేవలం పది శాతం సమస్యలు కూడా లేని ధరణిని రద్దు చేయడం దారుణమని, ధరణితో పారదర్శకత పెరిగిందని, 12 కోట్ల మంది ధరణి వెబ్‌సైట్‌ను విజిట్ చేశారని, లక్షల లావాదేవీలు జరిగాయని, రిజిస్ట్రేషన్ ఫీజు కింద కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి వచ్చాయని చెప్పారు.

### ప్రతి దశలోనూ లొసుగులు

భూ భారతిపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి పచ్చి అబద్ధాలు ఆడారని పల్లా మండిపడ్డారు. నిజాం తర్వాత తెలంగాణలో భూమినంతా 86 సంవత్సరాల తర్వాత కేసీఆర్ సర్వే (ఎల్ఆర్‌యూపీ) చేయించి హక్కు పత్రాలు ఇచ్చారని గుర్తుచేశారు. సీఎంవోలో ఉన్న అధికారులంతా ధరణి చట్టంలో పాలుపంచుకున్నవారేనని, వారిని కూడా రేవంత్ తప్పుబడుతున్నారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ తెచ్చిన సాఫ్ట్‌వేర్‌ను వాడుతూ రేవంత్ గత ప్రభుత్వాన్ని తప్పు పట్టడం విడ్డూరమన్నారు. విదేశీ సంస్థల చేతిలో ధరణి సాఫ్ట్‌వేర్ అనేది పూర్తి అబద్ధమని చెప్పారు. భూ భారతిలో జమాబందీని తిరిగి తెస్తున్నారని, దీని ద్వారా అక్రమార్కులకు పండుగేనని చెప్పారు. ఫౌతీ విధానం తేవడం తిరోగమన చర్యగా తాము భావిస్తున్నామని, దీని వల్ల కుటుంబంలో మళ్లీ తగాదాలు మొదలవుతాయని తెలిపారు. అనుభవదారు కాలమ్‌తో రైతు, కౌలు రైతులు ఇక నిత్యం కొట్లాడాల్సి వస్తుందని వాపోయారు. కొత్త దుకాణాలు మొదలై అవినీతి విచ్చలవిడి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మార్వో సంతృప్తి చెందితేనే మ్యూటేషన్ అనేది మరో అవినీతి దుకాణమని చెప్పారు. ధరణిలో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోయేదని, భూ భారతి చట్టాన్ని తాము తిరస్కరిస్తున్నామని తెలిపారు. భూ భారతిపై రైతులతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. పల్లా వెంట ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, కేవీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్, విజయుడు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

## బట్టకాల్చి మీదెయ్.. బద్నాం చెయ్!

- సభలో అదుపుతప్పుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- ఎడిట్ వీడియోలతో బీఆర్ఎస్‌పై నిందలు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర పాలకపక్షం తీరు 'బట్టకాల్చి మీదెయ్యాలె.. బద్నాం చెయ్యాలె' అన్నట్టుగా ఉన్నది. తప్పు చేయడమే కాకుండా చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షంపైకి నెపం నెడుతూ తాము చేసింది కరెక్టేనని నిరూపించేందుకు ఎంతకైనా తెగిస్తున్నది. ఇందుకు అసెంబ్లీ వేదికగా శుక్రవారం జరిగిన రెండు ఘటనలే తార్కాణంగా నిలుస్తున్నాయి. శుక్రవారం అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు కొందరు దౌర్జన్యానికి దిగడమే కాకుండా ఏకంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య ఆవేశానికి లోనై పేపర్ ఉండను బీఆర్ఎస్ సభ్యులపైకి విసిరారు. వీర్లపల్లి శంకరయ్య తమపై వాటర్‌బాటిల్ విసిరాడని, చెప్పు చూపాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ సభ్యులు మాత్రం అదేంలేదని తాము నిబంధనల మేరకే నడుచుకున్నామని చెప్తున్నారు. ప్రభుత్వం గాని, అసెంబ్లీ గాని ఎలాంటి వీడియోలను బయటపెట్టలేదు. తమపైకి చెప్పుతీశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించిన తర్వాత ఆయా వీడియోలను బయటికి ఇవ్వాల్సి ఉండగా అలాంటి ప్రయత్నమేదీ ప్రభుత్వం వైపు నుంచి జరగలేదు.

### ఆ వీడియో బయటకు ఎలా వచ్చింది?

ఈ కార్ రేసింగ్‌పై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళన చేస్తున్న వీడియోలు ఓ మీడియా చానల్లో ప్రసారమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బద్నాం చేయడమే లక్ష్యంగా హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆందోళన చేస్తున్న వీడియోలు బయటకొచ్చాయి. వాస్తవంగా వీటిని అసెంబ్లీ సిబ్బంది ప్రసారం చేయలేదు. కానీ, కుట్రపూరితంగా ప్రభుత్వ వర్గాలే ఆయా వీడియోను రికార్డు ఉన్న పెన్‌డ్రైవ్‌ను ఓ టీవీ చానల్‌కు అందించినట్టు విమర్శలు వస్తున్నాయి. అదికూడా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా ఎడిట్‌చేసి చానల్‌కు అందించగా అది ప్రసారమమైంది. మిగతా చానళ్ల రిపోర్టర్లు ఇదే విషయాన్ని సీఎంవో పీఆర్వోను అడిగితే తాము ఇవ్వలేదని, గ్యాలరీ నుంచి ఎవరో రికార్డుచేశారని చెప్పారు. వాస్తవానికి అసెంబ్లీ గ్యాలరీలోకి ఫోన్లను అనుమతించరు. మరీ ఫోన్లు ఎవరు తీసుకెళ్లారు అన్నది మిలియన డాలర్ల ప్రశ్న.